# కోవిడ్ ఛాంపియన్లు కొరోనా లక్షణాలున్న వ్యక్తులు/రోగులతో మాట్లాడేటప్పుడు, వారికేమయినా ఇచ్చేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

**ఎవరు పరీక్షకి వెళ్ళాలి?**

- ఎవరికయితే దగ్గు, జ్వరం, వాళ్ళు నొప్పులు/అలసట, విరేచనాలు, రుచి, వాసన కోల్పోవటం - ఈ లక్షణాలు మూడు రోజులకన్నా ఎక్కువ కొనసాగుతాయి, వారు కోవిడ్ 19 పరీక్ష కి వెళ్ళాలి
- వారిలో ఎవరయినా వయసులో పెద్ద వాళ్ళు, వికలాంగులు, ఎవరూ లేని ఒంటరి స్త్రీలు ఉంటే, వారికి టెస్టింగ్ కేంద్రానికి వెళ్ళటం కష్టమయే అవకాశం వుంది కాబట్టి, వారిని పరీక్షా కేంద్రానికి తీసుకెళ్ళాలి.
- ఏ వ్యక్తికయినా శ్వాస తీసుకోవటం కష్టమయితే, ఆక్సీజెన్ శాతం 95% కంటే క్రిందికి పడిపోతే, అయోమయం, షాక్ లో ఉన్నట్లు కన్పిస్తే, వెంటనే వారిని దవాఖానాకు తీసుకెళ్ళాలి.

**ఎట్లా వెళ్ళాలి?**

- పరీక్షా కేంద్రానికి ఎవరయినా వెళ్లాలంటే వారికి మీ ఆటో నంబర్లని ఇవ్వండి
- ఆటో రెండు వైపులా తెరలు పైకి పెట్టి, ఖుల్లాగా పెట్టాలి
- వీలయినంత వరకు, మీరు వారితో పాటు ఆటో లో వెళ్ళకూడదు. వేరే స్కూటర్ మీద గాని లేదా ఇంకో ఆటోలో గాని వెళ్ళాలి. లక్షణాలున్న వ్యక్తి, వారిని చూసుకునే వ్యక్తిని ఆటోలో వెళ్లనివ్వండి.

**పరీక్ష కేంద్రానికి వెళ్ళటానికి రోగిని/ లక్షణాలున్న వ్యక్తిని ఎలా సిద్ధ పరచాలి?**

- లక్షణాలున్న వ్యక్తికి ఒక మాస్క్ ఇవ్వాలి.
- వారి కుటుంబానికి ఏ పరీక్షా కేంద్రానికి తీసుకెళ్తున్నారో చెప్పండి. అవసరమయితే కుటుంబం నుండి ఎవరయినా వారితో పాటు వెళ్తారేమో కనుక్కోండి.
- పరీక్ష ఎలా జరుగుతుందో, ఎంత సేపు పడుతుందో, ఎంత సేపు వేచి ఉండాలో, పరీక్ష ఫలితం రావటానికి ఎంత సేపు పడుతుందో చెప్పాలి.
- మీకిచ్చిన పుస్తకం నుండి, ఆ ఇంట్లో వుండే వాళ్ళు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో వారికి చెప్పాలి.
- మీకు పరీక్షా కేంద్రంలో ఎవరయినా తెలిసిన వాళ్ళు ఉంటే, అక్కడికి ఫోన్ చేసి ఫలానా లక్షణాలున్న వ్యక్తి ఆటోలో వస్తున్నారని తెలిపి, వారి వివరాలు చెప్పండి
    - పేరు, వయస్సు, లింగం
    - రోగికి ఎటువంటి లక్షణాలు వున్నాయి, ఎన్ని రోజుల నుండి వున్నాయి
    - రోగికి మరేమయినా ఇతర జబ్బులు, ఆరోగ్య సమస్యలు ఉంటే అవి కూడా చెప్పాలి

**రోగి ఆటోలో ఎక్కేముందు వారికి చెప్పాల్సిన విషయాలు**

- టెస్టింగ్ జరిగే విధానం గురించి చెప్పండి
- రోగికి తగినంత సహాయం చెయ్యండి
- వారికేమయినా ప్రశ్నలుంటే సమాధానం ఇవ్వండి
- వారు టెన్షన్ కి గురవుతుంటే శాంత పరచండి
- రోగికి మాస్క్ ఎట్టి పరిస్థితుల్లో తియ్యకూడదని వివరించండి
- ఆటోలో వెళ్ళేటప్పుడు మాట్లాడ కూడదని, విశ్రాంతి తీసుకోవాలని చెప్పండి.

**ఆటోలు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలంటే**

- ఆటోలో, పాసెంజర్ సీటు, డ్రయివర్ సీటు కి మధ్య పలుచటి ప్లాస్టిక్ షీట్ ఉండాలి.

- ఆటోని శుభ్ర పరచటానికి బాటిల్లో ద్రావకం, అలాగే ఒక బట్ట ఎప్పుడు ఉండాలి. సీట్ మీద పరచటానికి న్యూస్ పేపర్లు ఉంచుకోవాలి.
- రోగిని టెస్టింగ్ కి తీసుకెళ్లి, తీసుకొచ్చిన తర్వాత ఆటోని సబ్బు నీళ్లతో గాని, వేరే ఇతర ద్రావకంతో గాని శుభ్రం చెయ్యాలి

    - ఆటోలో ఎక్కటానికి, కూర్చున్నప్పుడు పట్టుకోటానికి ఉపయోగించే కడ్డీలని తప్పకుండా శుభ్రం చెయ్యాలి.
    - సీట్లు, పక్కలు సబ్బు నీళ్లతో ముంచిన బట్టతో బాగా తుడవాలి. ప్రతి సారి ఎవరయినా ఎక్కే ముందు సీటు మీద ఒక న్యూస్ పేపర్ పరిచి, తిరిగొచ్చిన తరువాత దాన్ని చెత్త బుట్టలో పడెయ్యాలి.
    - ఆటో డ్రయివర్ తాను ముట్టుకునే తాళం చెవులు , స్టీరింగ్ కూడా శుభ్రం చేసుకోవాలి.

**మందులు, రేషన్స్, హైజీన్ కిట్ రోగి కుటుంబానికి ఇచ్చేటప్పుడు కోవిడ్ ఛాంపియన్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలు:**

- ఎవరయినా ఇంటికి ఏమయినా ఇవ్వటానికి వెళ్ళేటప్పుడు వారి ఇంట్లోకి వెళ్ళకండి. ఇంటి బయట నిల్చుని తలుపు దగ్గర ఇవ్వండి.
- వారిని రోగి/లక్షణాలున్న వ్యక్తి ఆరోగ్యం గురించి అడగండి. కానీ 5-10 నిముషాల కంటే ఎక్కువ మాట్లాడకండి.  అది కూడా రోడ్డు మీద నిలబడే మాట్లాడండి.
- మీరు, ఆ ఇంట్లో వ్యక్తి మాస్కు పెట్టుకునే మాట్లాడుకోవాలి.
- రోగి ఇంట్లో ఏమీ తినకుండా, తాగకుండా ఉంటే మంచిది.
- టెస్టింగ్ కేంద్రం నుండి ఇంటికి రాంగానే, మీరు పట్టుకెళ్లిన నీళ్ల బాటిల్,  పెట్టుకున్న కళ్ళజోడు సబ్బు నీళ్లతో కడిగేయండి. మొబైల్ ఫోన్, వాలెట్ శానిటైజ్ చేసుకోండి. కడగటానికి వీలు కాని బాగ్, నోట్ పుస్తకం వంటివి ఎవరికీ అందని ప్రదేశం లో పెట్టండి. మీ బట్టల్ని సబ్బు నీళ్లలో ఉతికేయండి.